క్లుప్తంగా

కాంగ్రెస్ పార్టీ ఆకునూరు గ్రామ కమిటీ ఎన్నిక



నూతన కమిటీతో మండల నాయకులు

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని మేజర్ గ్రామ పంచాయతీ ఆకునూరు గ్రామ కాంగ్రెస్ కమిటీ ఎన్నిక గురువారం జరిగింది. మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి ఆదేశాల మేరకు గ్రామ అధ్యక్షుడిగా ఆకుల రాజుగౌడ్, ఇందిరమ్మ కమిటీ అధ్యక్షుడిగా హైమద్, యూత్ అధ్యక్షుడిగా ఉడుత బాలరాజు, సోషల్ మీడియా ఇన్‌చార్జిగా అందె నానిబాబు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు మండల నాయకులు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ కొమ్ము రవి, మండల నాయకులు మంజ మల్లేశం, రంగు శివశంకర్‌గౌడ్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ కర్క సంతోష్‌రెడ్డి, నాయకులు రఘువీర్, బాలరాజు, మాదవరెడ్డి, రాములు, సత్యం, భిక్షపతి, వెంకట్‌రెడ్డి, శ్రీకాంత్, చంద్రం, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

చెరుకుపై విమర్శలు అర్ధ రహితం

తొగుట(దుబ్బాక): కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డిపై బీఆర్‌నాయకులు చేసిన విమర్శలు అర్ధ రహితమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు అక్కం స్వామి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గాల అభివృద్ధికి నిధులు మంజూరు చేశారన్నారు. అందులో భాగంగా దుబ్బాక నియోజకవర్గానికి రూ.10 కోట్లు మంజూరయ్యాయన్నారు. వీటితో పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, తాగునీరు, ప్రభుత్వ కార్యాలయాల మరమ్మతులకు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో దుబ్బాక నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. సమావేశంలో మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కొండల్‌రెడ్డి, ఐఎన్‌టీయూసీ దుబ్బాక ఇన్‌చార్జి బాలమల్లు, నాయకులు పాల్గొన్నారు.

జిల్లా సమన్వయ కర్తకు ప్రసంశ పత్రం



ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న జిల్లా విద్యాశాఖ సమన్వయకర్త భాస్కర్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మేడారం సమ్మక్క సారలమ్మ జాతరలో పర్యావరణ సమస్యలపై సిద్దిపేట జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అవగాహన కల్పించినందుకుగాను జిల్లా విద్యాశాఖ సమన్వయకర్త భాస్కర్‌కు రాష్ట్ర అటవీశాఖ, హనుమకొండ కలెక్టర్, టీఎస్‌పీసీబీ అధికారులు ప్రశంస పత్రాన్ని అందజేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి గురువారం తెలిపారు. జాతీయ సైన్స్ డేలో భాగంగా వరంగల్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో అటవీశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వాణి ప్రసాద్, హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్త పట్నాయక్, టీఎస్‌పీసీబీ రాష్ట్ర అధికారి ప్రసన్న కుమార్ చేతుల మీదుగా అందించారన్నారు.

ప్రమాదకరంగా కల్వర్టు



దుబ్బాక - హబ్సీపూర్ మార్గంలోని కల్వర్టు

దుబ్బాక: దుబ్బాక నుంచి హబ్సీపూర్ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిలో రామసముద్రం చెరువు కట్ట సమీపంలో ఉన్న కల్వర్టు ప్రమాదాలకు నిలయంగా మారింది. కల్వర్టు ఇరుకుగా ఉండటంతో ఎదురుగా భారీ వాహనాలు వస్తే అటుగా వెళ్లే వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటీవల కల్వర్టుకు ట్రాక్టర్ ఢీ కొనడంతో ప్రమాదం జరిగింది. గతంలో ద్విచక్ర వాహనదారులు కల్వర్టును ఢీకొని మృత్యువాత పడ్డారు. సంబంధిత అధికారులు సమస్యను పరిష్కరించాలని వాహనదారులు కోరుతున్నారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. గురువారం సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలో సిబ్బందితో వాహనాల తనిఖీ నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన తొమ్మిది మందిని సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన జడ్జి శ్రావణి వారికి రూ.4,100 జరిమానా విధించారు.

మున్సిపల్ బడ్జెట్ రూ.15.79 కోట్లు

- వ్యయం రూ.15.78 కోట్లు, మిగులు రూ.లక్ష
- ఏకగ్రీవ ఆమోదం తెలిపిన సభ్యులు
- హాజరైన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల మున్సిపాలిటీ 2024–25 సంవత్సరానికిగాను అధికారులు రూ.15.79 కోట్ల అంచనా బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణి అధ్యక్షతన గురువారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో సభ్యులు ఆమోదం తెలిపారు. ఈ సమావేశానికి జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు. 2023–24 సంబంధించి బడ్జెట్‌ను రూ.21.97 కోట్ల నుంచి రూ.10.88 కోట్లకి సవరించారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.15.79 కోట్ల ఆదాయం, రూ.15.78 కోట్ల వ్యయం, రూ.లక్ష మిగులుగా ప్రతిపాదించి ఆమోదించారు.



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, చైర్ పర్సన్ స్వరూపరాణి

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల మున్సిపల్ అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తానని, పార్టీలకతీతంగా అభివృద్ధి, పాలన చేపట్టినపుడే ప్రజలకు మేలు జరుగుతుందని జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ 2024–25 బడ్జెట్ సమావేశంలో పట్టణ అభివృద్ధికి సబంధించిన పలు అభివృద్ధి పనులపై చర్చించారు. కౌన్సిల్ తీర్మానం పొందిన తర్వాతనే అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. పన్నులు చెల్లించిన వారికి చెల్లించలేదని నోటీసులు వస్తున్నాయని తమ దృష్టికి వచ్చిందని, వెంటనే ఆ సమస్య పరిష్కారించాలని సంబంధిత అధికారులకు సూచించారు. మున్సిపాలిటీ అభివృద్ధితోపాటు ప్రజాసమస్యల పరిష్కారానికి ఏమి చేయాలో ఆలోచించాలన్నారు. అసంపూర్తిగా నిలిచిన అభివృద్ధి పనులు సవ్యంగా సాగేందుకు సహకరించాలన్నారు. కౌన్సిలర్లు ప్రజల్లో ఉంటూ వార్డుల్లో నెలకొన్న సమస్యలను తెలుసుకొని వెంటనే పరిష్కారించాలన్నారు. అధికారులు బాధ్యతతో విధులు నిర్వర్తించాలన్నారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధికి అందరం సమన్వయంతో కృషి చేద్దామన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, కౌన్సిలర్లు మంగోలు చంటి, ఆడెపు నరేందర్, యాట కనకవ్వ, ఉడుముల ఇన్నమ్మ, సందుల సురేష్, తుమ్మలపల్లి లీల, ముస్త్యాల తార, పచ్చిమడ్ల సతీష్, కో ఆప్షన్ సభ్యులు ఆరోగ్యరెడ్డి, అంజనాదేవి, జేబా బేగం, నాగేశ్వర్‌రావు, కమిషనర్ రమేష్, మేనేజర్ ప్రభాకర్, ఏఈ శ్రీకాంత్, రాములు, సిబ్బంది పాల్గొన్నారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి



వాహనదారులకు గులాబీ పూలు అందజేసి అవగాహన కల్పిస్తున్న సీఐ రామకృష్ణ, సిబ్బంది

సిద్దిపేటకమాన్: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ అన్నారు. గురువారం సిద్దిపేట మోడ్రన్ బస్టాండ్ వద్ద వాహనదారులు, ప్రయాణికులు, వ్యాపారులకు హెల్మెట్ వినియోగం, రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు, మైనర్ డ్రైవింగ్‌పై అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించని వాహనదారులకు ట్రాఫిక్ సిబ్బంది గులాబీ పూలు ఇస్తూ రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. మైనర్ డ్రైవింగ్, త్రిపుల్ రైడింగ్ చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కారు నడిపేటప్పుడు సీట్ బెల్ట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ వినయ్‌సాగర్, ఏఎస్ఐ ఉమేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సివిల్ రైట్స్ డేపై అవగాహన



గౌరారంలో మాట్లాడుతున్న ఎస్ఐ శివకుమార్



కోమటిబండలో మాట్లాడుతున్న సీఐ సైదా

జగదేవ్‌పూర్(గజ్వేల్): జగదేవ్‌పూర్ మండలంలోని బిజివెంకటాపూర్ గ్రామంలో గురువారం పౌరహక్కుల దినం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఐ నాగరాజు మాట్లాడుతూ పౌరహక్కులపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మంజుల, నాయకులు పరమేశ్వర్, రాజు, భాను, కనకయ్య, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

గౌరారంలో ..

వర్గల్(గజ్వేల్): రెవెన్యూ, పోలీసు శాఖ ఆధ్వర్యంలో గురువారం వర్గల్ మండలం గౌరారంలో పౌరహక్కుల దినం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరారం ఎస్సై శివకుమార్ మాట్లాడుతూ అంటరాని తనం పాటిస్తే శిక్షార్హులవుతారన్నారు. బాల్య వివాహాలు నేరమని, ప్రజలు పౌరహక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎంపీడీఓ విజయలక్ష్మి మాట్లాడుతూ సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. సమావేశంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కోమటిబండలో..

గజ్వేల్‌రూరల్: మండల పరిధిలోని కోమటిబండ గ్రామంలో గురువారం పౌరహక్కుల దినం నిర్వహించారు. ఈ సందర్భంగా గజ్వేల్ సీఐ సైదా, ఆర్ఐ కృష్ణ మాట్లాడుతూ మనుషులంతా ఒక్కటేనని, అంటరానితనం, అసమానతలు నిర్మూలించడం కోసం ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. గ్రామస్తులంతా కలసిమెలసి ఉంటూ గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తూం శేఖర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు



గజ్వేల్‌లోని బాలుర జూనియర్ కళాశాల వద్ద సిబ్బందికి సూచనలు చేస్తున్న ఏసీపీ బాలాజీ

గజ్వేల్ రూరల్: ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సర వార్షిక పరీక్షలు గజ్వేల్‌లో గురువారం ప్రారంభమయ్యాయి. పట్టణంలోని మొత్తం తొమ్మిది కళాశాలలో ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభమవగా మొదటి రోజు 2023 మంది విద్యార్థులకును 2148 మంది పరీక్ష రాసినట్లు అధికారులు తెలిపారు. గజ్వేల్ ఏసీపీ బాలాజీ పట్టణంలోని పలు పరీక్షా కేంద్రాలను సందర్శించి బందోబస్తును పర్యవేక్షించారు.

కొండపాక(గజ్వేల్): ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 144 మంది విద్యార్థులకుగాను ఇద్దరు, మోడల్ స్కూల్లో 98 మందికిగాను ఆరుగురు గైర్హాజరయ్యారు.

నిమిషం నిబంధనతో..

చేర్యాల(సిద్దిపేట): ఇంటర్ పరీక్షలకు నిమిషం ఆలస్యం నిబంధన కారణంగా ఇద్దరు విద్యార్థులు పరీక్షకు దూరయ్యారు. ఈ ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సర పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రానికి ఒక విద్యార్థి, మండల పరిధిలోని ముస్త్యాల మోడల్ స్కూల్ కేంద్రానికి మరొక విద్యార్థిని ఆలస్యంగా రావడంతో వారిని పరీక్ష రాయడానికి అనుమతించలేదు. దీంతో ఇద్దరూ పరీక్ష రాయకుండానే వెనుదిరిగి వెళ్లారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

సిద్దిపేటజోన్: భవన నిర్మాణ రంగ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కార్మిక శాఖ అధికారికి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ మాట్లాడుతూ కేంద్రం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్నారు. 60 ఏళ్లు నిండిన కార్మికుడికి నెలకు రూ.6 వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

సిద్దిపేటకమాన్: రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడంపై ఎన్ఎస్‌యూఐ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం సిద్దిపేట బస్టాండ్ చౌరాస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. గతంలో ప్రకటించిన ఆరు గ్యారంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం తప్పకుండా అమలు చేస్తుందన్నారు.

ప్రజలకు ఇబ్బందులు తలెత్తకూడదు

దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దౌల్తాబాద్(దుబ్బాక): ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు తమ విధులను నిర్వర్తించాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన వ్యవసాయ సహకార సంఘం భవనాన్ని డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామాల స్పెషల్ అధికారులు, పంచాయతీ అధికారులకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులను ఆర్థికంగా ముందుకు తీసుకెళ్లి తగిన ప్రాధాన్యత కల్పించామన్నారు. వేసవిలో గ్రామాల్లో ప్రజలకు నీటి ఎద్దడి, విద్యుత్ తదితర సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. సాగు నీటి పంపిణీలో ఇబ్బందులు కలగకుండా చూడాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, వైస్ చైర్మన్ రవీందర్‌గౌడ్, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రణం శ్రీనివాస్‌గౌడ్, తహసీల్దార్ సుజాత, ఎంపీడీఓ వెంకటలక్ష్మీ, ఎంపీపీ గంగాధరి సంధ్య, జెడ్పీటీసీ రణం జ్యోతి శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు రహీమొద్దీన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, ఏఎంసీ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ చిన్నారికి పోలియో చుక్కలు వేయాలి

పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రాహుల్



గజ్వేల్‌లోని ఐఓసీలో పల్స్‌పోలియోపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రాహుల్

గజ్వేల్‌రూరల్: నవజాత శిశువు నుంచి ఐదేళ్లలోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయాలని శ్రీగిరిపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రాహుల్ సిబ్బందిని ఆదేశించారు. పట్టణంలోని ఐఓసీలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు పల్స్ పోలియోపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలియో మహమ్మారితో ఎంతోమంది చిన్నారులు అంగవైకల్యానికి గురవుతున్నారని, దీని నివారణకు పోలియో చుక్కలు వేయడం ఒక్కటే మార్గమమన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో డాక్టర్ కాశిం, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శ్రీలత, రూట్ సూపర్‌వైజర్ వాసుదేవ్, నాగరాజు, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ వైపు బీఆర్ఎస్ నాయకుల చూపు!

- కార్పొరేట్ పదవులు ఆశించి భంగపడ్డ నాయకులు
- పార్టీలో గుర్తింపులేదని అసహనం
- కాంగ్రెస్‌లో చేరేలా సన్నాహాలు

కొండపాక(గజ్వేల్): గజ్వేల్ నియోజక వర్గంలోని కొండపాక, కుకునూరుపల్లి మండలాల్లోని బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో పెద్ద ఎత్తున కాంగ్రెస్‌లో చేరేలా సన్నాహాలు సాగుతున్నాయి. తెలంగాణ ఉద్యమ సమయం నుంచి కొండపాక మండలం బీఆర్ఎస్ పార్టీకి కంచుకోటగా నిలుస్తూ వచ్చింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కేసీఆర్‌కు అత్యధిక మెజారిటీ వచ్చేలా బీఆర్ఎస్ నాయకత్వం పని చేసింది. పార్టీ స్థాపించిన నాటి నుంచి పనిచేస్తున్న వారు పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో వ్యవసాయ మార్కెట్ కమిటీ తదితర కార్పొరేట్ పదవులను ఆశించినప్పటికీనీ ప్రభుత్వం భర్తీ చేయలేదు. దీనికి తోడు పార్టీలో సరైన గుర్తింపు లభించకపోతుండటంతో మెల్లమెల్లగా పార్టీపై అసహనం పెరుగుతూ వచ్చింది. అయినప్పటికీ మూడోసారి పార్టీ అధికారంలోకి వస్తుందని, అప్పుడు కార్పొరేట్ పదవులు దక్కించుకోవచ్చన్న ధీమాతో కేసీఆర్‌ను భారీ మెజారిటీతో గెలిపించారు. ఆయన ఎమ్మెల్యేగా గెలుపొందినా పార్టీ అధికారాన్ని కోల్పోయింది. గతంలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో సన్నిహితంగా ఉన్న బీఆర్ఎస్ నాయకులను కాంగ్రెస్‌లో చేర్చుకునేలా ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలో ఇటీవల నెల వ్యవధిలో కుకునూరుపల్లి, దుద్దెడ తదితర గ్రామాల నుంచి బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కొత్తగా పార్టీలో చేరిన వారు కొండపాక, కుకునూరుపల్లి మండలాల్లోని సుమారు 700 నుంచి 800 మంది బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరేలా మంత్రి పొన్నం ప్రభాకర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు, గజ్వేల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డిని కలిసి మంతనాలు జరిపినట్లు సమాచారం. నాలుగు లేదా ఐదు రోజుల్లో పెద్దఎత్తున కాంగ్రెస్‌లో చేరికలు ఉండేలా సన్నాహాలు ముమ్మరంగా సాగుతున్నాయని జోరుగా ప్రచారం సాగుతోంది. ఇదే జరిగితే మండలంలో బీఆర్ఎస్ పట్టు కోల్పోక తప్పదని చెప్పవచ్చును.

నేత్రపర్వంగా రామలింగేశ్వర స్వామి కల్యాణం



రామలింగేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యేలు



బెక్కల్‌లో మంగళసూత్రం చూపుతున్న పూజారి

మద్దూరు(హుస్నాబాద్): దూళ్మిట్ట మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం బెక్కల్ రామలింగేశ్వర స్వామి ఆలయంలో శ్రీ బ్రమరాంబ సహిత రామలింగేశ్వర స్వామి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. స్వామివారి కల్యాణోత్సవానికి దేవాదాయశాఖ అధికారులు పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. వధూవరుల తరుపున ఇమ్మడి శోభ పురోత్తంరెడ్డి, రాజపేద పద్మమల్లేశం కల్యాణం జరిపించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి గంగ స్నానం నిర్వహించిన అనంతరం ఉత్సవ విగ్రహాలను ఆలయ పరిసర ప్రాంతాల్లో ఊరేగిస్తూ మేళతాళాలు, కోలాటం, శివకీర్తలనల మధ్య కల్యాణ వేదిక వద్దకు తీసుకొచ్చారు. 903 సంవత్సరాలకు పూర్వం కొండపై వెలసిన రామలింగేశ్వ స్వామికి కాకతీయులు ఆలయం నిర్మించారని ఇక్కడి శిలాశాసనాల ద్వారా తెలుస్తోంది. అప్పటి నుంచి రామలింగేశ్వర స్వామి వారు భక్తుల పూజలు అందుకుంటున్నారు. స్వామి వారి కల్యాణం తిలకించడానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నాగపూరి రాజలింగం, మాజీ ఎంపీటీసీ నలగొప్పుల రాములు, పూజర్లు భద్రప్ప, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని లక్ష్మీపూర్‌లో నిర్వహిస్తున్న రామలింగేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు గురువారం వైభవంగా జరిగాయి. మూడు రోజులుగా జరుగుతున్న ఈ ఉత్సవాల్లో చివరి రోజు మాజీ ఎంపీ, మాజీ ప్లానింగ్ కమిటీ ఉపాధ్యక్షుడు బోయినిపెల్లి వినోద్ కుమార్, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వారిని శాలువాలతో సన్మానించి స్వామి వారి చిత్రపటాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ లింగాల నిర్మల, నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ కొనసాగుతున్న దీక్ష

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గూడెం గ్రామానికి చెందిన దళితులు మూడెకరాల భూ కేటాయింపు కోసం బెజ్జంకి తహసీల్దార్ కార్యాలయం వద్ద రెండో రోజు గురువారం రిలే దీక్ష కొనసాగించారు. గత ప్రభుత్వం ఇచ్చిన భూ పంపిణీలో అక్రమాలు జరిగాయని, వాటిని రద్దు చేసి అర్హులకు న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్యామ్ మాట్లాడుతూ ప్రభుత్వానికి నివేదిక పంపుతామన్నారు.

◆ పాలక మండలి నియామకం

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని బెక్కల్ రామలింగేశ్వరస్వామి ఆలయ పాలక మండలిని నియమించినట్లు దేవాదాయశాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆలయ కమిటీ చైర్మన్‌గా బెక్కల్ గ్రామానికి చెందిన చొప్పరి మల్లేశం, సభ్యులుగా ఇమ్మడి శోభ, ధరావత్ సరిరాం, చెన్నోజు బ్రహ్మచారి, రాజుపేట మల్లేశం, స్వర్గం సాంబయ్య, ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఆలయ అర్చకుడు సిద్దాపురం శివప్పను నియమించింది. కాగా బ్రహోత్సవాలకు ముందు పాలకమండలిని ప్రకటించాల్సి ఉండగా వారం తర్వాత ప్రకటించారు.

◆ నేటి విద్యార్థులే దేశ భవిష్యత్ నిర్మాతలు



స్వయం పాలనలో పాల్గొన్న విద్యార్థులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): నేటి విద్యార్థులే రేపటి దేశ భవిష్యత్ నిర్మాతలని శ్రీ సరస్వతి శిశుమందిర్ ప్రధానాచార్యుడు నరేష్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్‌లో స్వయం పాలన దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగామారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు.

◆ ఆ పాఠశాలపై చర్యలు తీసుకోవాలి : ఎన్ఎస్‌యూఐ నాయకులు



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

సిద్దిపేటరూరల్: భద్రత ప్రమాణాలు పాటించకుండా, అధిక ఫీజులు వసూలు చేస్తున్న రంగాధాంపల్లి బ్రాంచ్ శ్రీ చైతన్య రెసిడెన్షియల్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం నియోజకవర్గ ఎన్ఎస్‌యూఐ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఏఓకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీచైతన్య పాఠశాల యాజమాన్యం ఎటువంటి భద్రత ప్రమాణాలు పాటించకుండా పాఠశాలను నడుపుతున్నారని, అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి సతీష్, నియోజకవర్గ అధ్యక్షుడు రాకేష్ యాదవ్, నాయకులు మొగిలి రాకేష్, సాజిద్, సన్నిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ కాండం తొలుచు పురుగును నిర్మూలించాలి: వ్యవసాయ అధికారి మల్లేశం

మిరుదొడ్డి(దుబ్బాక): వరిని ఆశిస్తున్న కాండం తొలుచు పురుగు నిర్మూలనకు రైతులు చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి మల్లేశం సూచించారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో వరి కాండం తొలుచు పురుగు ఆశించిన పొలాలను గురువారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిలక దశలో ఉన్న వరి పైరుకు ఎకరానికి కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు 10 కిలోలు లేదా కార్టప్ హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలు ఎనిమిది కిలోలు చల్లుకోవాలని సూచించారు. చిరు పొట్ట దశలో పురుగు ఉధృతి గమనించినట్లయితే కార్టప్ హైడ్రోక్లోరైడ్ 50 శాతం ఎస్పీ 2 గ్రాములు లేదా క్లోరంటా నిప్రోల్ 0.3 మిల్లీ లీటర్లు లేదా ఇసోసైక్లోసీరం 0.6 మిల్లీ లీటర్లు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. ఆయన వెంట ఏఈఓ రేణుక, రైతులు ఉన్నారు.



వరి పంటను పరిశీలిస్తున్న మండల వ్యవసాయ అధికారి మల్లేశం